

# భా(భీ)మా కలాపం

నట్టింటి గూటికి సరిగ్గా నాలుగు జానెళ్ళ ఎత్తులో, నలుగురు దేవుళ్ళ పటాలమధ్య అందంగా అమర్చిన అద్దానికి అడ్డంగా నిలబడి, పైట చెరగును ముందుకుతీసి మునిపంటితో కరచిపట్టి, 'మేమెంతో ముందుకు పోయాం!' అని విఱ్ఱవీగే నారీలోకాన్ని 'లేదు' అని సవాలు చేసినట్టు వెనక్కు వెళ్ళిన రవికగుండీలను తగిలించుకోవడానికి తంటాలుపడుతూ, అద్దంలోని ప్రతిబింబంవైపు పోజుపెట్టి నిలబడివుంది ఆమె! అనుకోకుండా నేను గుమ్మంలో అడుగుపెట్టేసరికి 'ఓ! మీరా?' అన్న మాటలు అప్రయత్నముగా ఆమె నోటినుండి వెలువడడమూ, మునిపంట కరచి పట్టిన పైట చెరగు జారిపోవడమూ, ఆమె లోనికి పారిపోవడమూ, క్షణంలో జరిగిపోయాయి. గిరుక్కున వెనక్కు తిరిగిపోవాలనిపించి, నేను తిరుగుముఖం పెట్టినా, 'ఎందుకు పారిపోవాలి? ఆమె?'.... పైట జారింది పో మళ్ళీ సర్దుకోవచ్చునే?.... వెంటనే సర్దుకోలేకపోయినా దాచుకొన్న సౌందర్యం కనీసం కళ్ళతోనైనా దోచుకోవడానికి ఆస్కారంలేని

రీతిలో ఒకటిరెండు బంధనాల మధ్య పదిలపరచబడివుందే! అదీగాక— తీర్చిగ్గా అలంకరించుకొని బజార్ల వెంబడిపడి, అంతంతమాత్రంగా మిగిలి, మళ్ళీ ముందుకే వాలిన పైటచెరగు రవికలో దూరి సమున్నత ప్రదేశాన్ని చక్కలిగింతలు పెట్టాలని ప్రయత్నించేస్తూఉంటే, నడుము నాజూకును, కటిస్థలి పటుత్వాన్ని ప్రదర్శించాలని ప్రాకులాడుతూ, అలంకరణలో ముందడుగువేశామని భ్రమిస్తున్న నారీ లోకానికే ఈమె ప్రవర్తన ఎబ్బెట్టుగా కనుపించదా? మరి? - ఆమె ఎందుకలా పారిపోయి, నాలో యిలాంటి విపరీతమైన ఆలోచనలకు దోహదమివ్వాలి!' అన్న ఆలోచనలు కాళ్ళకు బంధాలు తగిలిస్తే కాసేపు నిలబడిపోయాను. ఇక నేనక్కడ నిలబడలేక అడుగు ముందుకు వేయబోయాను, ఆ సంఘటన మరచిపోదామన్న ప్రయత్నంతో!

'ఏమండీ? అప్పుడే వెళ్ళిపోతున్నారే!'

తిరిగి చూచాను. మరులు గొలిపే సౌందర్యము మాటలాడుతూ ఉంది—నట్టింట నాజూకైన రూపాన్ని సంతరించుకొని. చిందరవందరగ పారాడుతున్నాయి వదనారవిందములో చిరునవ్వులు ముంగురులలో పోటీ పడుతూ!

"ఎందుకండీ? అలా గుడ్లప్పగించి చూస్తారు! నిలువుగుడ్లు పడిపోయేను. లేదా - మా యింట్లో పిడికెడు మిరపకాయల ఘాటుకి తట్టుకోలేక అందరూ నన్ను తిట్టిపోస్తారు. ఇలా వచ్చి కూర్చోండి."

ఓ చిన్న 'స్టూలు'లాంటి ఆసనాన్ని చూపింది - వచ్చీరాని నవ్వు తన మొగానికి ఓ విధమైన వన్నె తెస్తూంటే. వెళ్ళిపోదామనిపించినా కదలికకు కళ్ళెంవేస్తున్నాయి ఆమె చూపులు. మారుమాట్లాడకుండా వెళ్ళి కూర్చున్నాను. జారిపోయిన పైటచెంగునుతీసి మెడచుట్టూవేసి లాగి మునిపంటితో కొరుకుతూ వుంది కసిదీర. బహుశా మగవాళ్ళున్నారని కూడ తెలియకుండ జారిపోయినందుకు కోపమేమో మరి? ఏమి మాట్లాడదానికి

తోచకుండా గత సంఘటనలతో కలిసి నా పూర్వ స్మృతులన్నీ కనుల ముందు మెదిలేసరికి ఆమెవైపు చూడడానికి ధైర్యంచాలక, ప్రక్కన మేజామీద ఓ పాతపత్రిక పడివుంటే తీసుకొని పేజీలు తిప్పుతున్నాను, అక్షరాలు కనుపించకపోయినా.

'ఏమండీ! ఈమధ్య స్ట్రయిక్ చేశారే?'

అడుగుతున్నది ఆమె సోదరి. పేరు శాంత. వేసిన జడను విప్పి నాలుగుసార్లు వేసుకొంటూ వుంది చెప్పే భావాన్నే మరలా మరలా చెప్పే చేతగాని కవిలా! కాటుక దిద్దినతీరు....నుదుట ముంగురులను అతి జాగ్రత్తగా తీర్చిదిద్దినసౌరు....చామన చాయను మార్చడానికి ఒత్తుగా మెత్తుకొన్న పౌడరూ....గమనిస్తూంటే—అప్పుడే రంగస్థలంలో ప్రవేశ పెట్టడానికి అలంకరణ పూర్తిచేసిన నాయికామణిలాగ కనిపిస్తూవుంది సామాన్యుల కంటికి. 'శాంతవో!....అయస్కాంతానివో!' అని కవిత్వం ఆరంభిస్తాడేమో ఎవరైనా భావకవి కంటపడడం తటస్థిస్తే!

"మరి యిది సమ్మెల యుగమే కదండి!" అన్నాను నెమ్మదిగా.

"నిజమే ననుకోండి. యజమానికీ కార్మికునికీ మధ్య సమ్మెలుండడం సహజం. ఇక హైస్కూళ్ళు కాలేజీలంటారా? అంతకంటే సహజం. భార్యాభర్తలమధ్య కూడ ఈమధ్య సమ్మెలు ప్రారంభమయ్యాయని వింటున్నామంటే—అది సహజంలో అసహజం. ప్రేయసీ ప్రియుల వరకు కూడ దీనిని పొడిగించవచ్చునేమో కానీ స్నేహితుల మధ్య సమ్మెలేమిటండీ!" గచ్చకాయ కుండలో చేయిబెట్టి త్రిప్పినట్లున్నాయి మాటలు.

సరైన సమాధానంకోసం ఆలోచిస్తూ ఉంది మనస్సు.

'ఉండవే నీ బోడి వ్యాఖ్యాలున్నూ నీవున్నూ! పాపం! ఆయనేమో లేకలేక పండుగంటి రోజున వచ్చాడు. అందులో ఎంతో బడలికగా కన్పిస్తున్నాడు కూడా! కాస్త కాఫీ అయినా యిద్దామనుకుండా?'

అడ్డు తగిరింది ఆమె!

'ఇప్పుడే తాగి వస్తున్నానండీ! — ఎందు కనవసరమైన శ్రమ!''

చెబుతున్నా వినిపించుకోకుండా ఆమె లోనికి వెళ్ళింది.

"అరె! మీరూ తాగుతారన్నమాట!" — తాగడాన్ని కాస్త ఒత్తి మెత్తగా ఎత్తిపొడవాలని ప్రయత్నించింది శాంత. సాధారణంగా తక్కువగా మాట్లాడి ఎక్కువగా వింటే, తద్వారా విషయసేకరణ జరుగవచ్చునని అభిప్రాయపడేవాడిని. కాని ఈ మాటతో ఎక్కడో నక్కి ఉన్న గోరంత అహం దెబ్బతినింది. ఎదురుదెబ్బ కొట్టాలని ఉడుకుమోతుతనం హెచ్చింది.

"అవునండీ! శాంతాదేవిగారూ! తాగడమంటే అటు యిటూ కాదు. ఒళ్ళు మరచిపోయేదాక తాగుతాను.... అందులో మీలాంటి అందమైన అమ్మాయిలు కంట పడ్డప్పుడు సౌందర్యాన్ని!"

చిరుకోపం ఆమె అలంకరణకు మరింత అందాన్ని పులిమితే, తుర్రున పారిపోయింది శాంత. ఆ హాల్లో ఆ స్టూలుమీద కూలబడివున్నాను — అడిగిన దానికి బదులు సదులు చెప్పని మొద్దబ్బాయిలాగ నేను. ఓమూల రెండు మూటల ధాన్యం.... కిచకిచమని ధ్వనిచేస్తూ, గూళ్ళు కట్టుకోవడానికి ప్రయత్నం చేస్తూ, ఆ ప్రయత్నంలో అక్కడక్కడ చెత్తచెదారాన్ని రాలుస్తూ పిచ్చుకలు.... నట్టింటి గూటికిపైన నలుగురు దేవుళ్ళు.... దేనితోను నిమిత్తంలేని సాధుపుంగవునిలా పంచన ఓనామాల అసామి.... నా ఒంటరితనాన్ని చూచి జాలిపడుతున్నారేమో?

ఒంటరితనంలో ఆలోచనలు రెక్కలు విప్పుకొంటున్నాయి.

* * *

అప్పటికి సరిగ్గా యేడాది క్రిందట ఆమెను చూశాను.

ఆమెనే కాదు ఎందరినో చూస్తుంటాను. ఆఫీసుకు బయలుదేరక ముందు, ఆఫీసునుండి తిరిగి వచ్చినపిదప అలవాటుమేరకు మా యింటి డాబామీద కాసేపు నిలబడితే చాలు, ఎందరో కనిపిస్తూ వుంటారు.

సన్నగా ఎట్టిగా ఉంటుంది ఆమె. మరీ అంత పొట్టి అంత పొడుగు కాక పోయినా ఎత్తుమడమల జోళ్ళమీద కాసంత ఎత్తుగానే కనిపిస్తూ వుంటుంది. ఆమెను చూస్తేనే భయం.... పెద్ద గాలివీస్తే యేమైపోతుందో? ఏమో? అని. ఎడమచేతిమీద తెల్లటి కోటు.... మెడలో స్టెతస్కోపు....కుడిచేతి ఆధారంతో నడుముమీద నాట్యంచేస్తూ ఓ నాలుగు పుస్తకాలు.... వైద్యకళాశాల అమ్మాయిలా ఉంటుంది. తలలోని సంపెంగపూల సౌరభము తెంపులు తెంపులుగా వస్తూ ఉంటుంది. మెడలో 'స్టెతస్కోపు' ఏమీ లేని వక్షస్థలి మీద ప్రాకులాడుతూ ఉంటుంది పాపం! ఏమి వారుకొందామనో యేమో? ప్రతిరోజు ఉదయం ఆ దారి వెంబడి వెళ్ళి మళ్ళీ సాయంకాలము అదే దారిమీదనే వస్తూ ఉంటుంది. ఆమె మొగముతో పోటీపడుతూ ఉదయం సౌరభాలు వెదజల్లే సంపంగులు సాయంకాలానికి వాడి వత్తలై ఉంటాయి ఆమెలాగే! అవును మరి! వాటి స్వభావమే అంత! ఆమెకు 'సంపంగి' అని నామకరణం చేశాను.

'మూన్ కట్ జాకెట్టు'ను మించి ముడతలు పడిన కండరాలు.... 'ఏమాత్రం మీరు అజాగ్రత్తపడినా మా పరువు దక్కదు' అని వీపు నాశ్రయించిన రవిక గుండీలను బ్రతిమాలాడుతూ వక్షోజాలు....'చూడు నా దెబ్బ!' అని వీటినన్నిటిని సవాలుచేస్తూ 'స్కూటరు' చక్రంలా తయారై నడినెత్తికెక్కిన సిగముడి!....అందులో ఒకటే ఒక్క పువ్వు!!—సరిగ్గా మా ఎదురింటికి ఓ అయిదారు యిండ్ల కవతల కడప ఆధారంతో నిలబడి వుంటుంది మరొక ఆవిడ! మా అమ్మ, అమ్మమ్మలు కట్టుకొంటూ వుండిన పదహారు మూరల పొడవు చీర సంగతి అటుంచి, ఈ కాలంకారుకు కాస్త ఎక్కువనిపించే పన్నెండు మూరల చీర సరిగ్గా ఆమె భుజస్కంధాలను తాకీతాకనంత వరకు వచ్చి ఆగిపోతే, పాపం! ఆధారరహితమైన ఆ పైటను సర్దుకోవడములో సరిపోతూ ఉంటుందామె పని! ఆమెను చూస్తే బాగా కండపట్టిన ఒంగోలుగిత్త జ్ఞాపకమొస్తుంది. అందుకే నేనామెను 'ఒంగోలుగిత్త' అంటూ ఉంటాను.

ఉన్న బెత్తెడు వెంట్రుకలకు నాలుగు బెత్తెళ్ళ పొడవు వెంట్రుకలను నాజూగ్గా జతచేర్చి జడ అల్లితే అది ఎప్పుడూ కటిస్థలి నాశ్రయించి ఉంటుంది. సాధారణంగా కీల్జడ తృటి నటియిస్తుందని పూర్వ కవుల వర్ణన. ఆ నటన అందంగా కనుపిస్తుందికూడ. కానీ ఆమె నడుస్తూ ఉంటే సైనిక వందనం స్వీకరించే ప్రధాని జ్ఞాపకం వస్తాడు. ఉత్సవ విగ్రహాలముందు హుందాగా ముందుకుసాగే గజరాజు మదిలో మెదులుతాడు. రాయంచల నడ కల వయ్యారాలు నాట్యం చేస్తాయి కనులముందు!—అంటే ఆమె నడుస్తూ ఉంటే కటిస్థలిమీద తెగబారెడు జడ కదిలితే ఒట్టు!

అందుకే నేను ఆమెను 'రాజహంస' అంటాను.

ఇలా ప్రతిదినమూ ఎందరో కనబడుతుంటారు.కంటపడ్డప్పుడు ఏవేవో పేర్లుకూడ పెడుతుంటాను. మరలా ఓ సారి వాళ్ళు కంటపడేవరకు కనీసం ఆ పేరుకూడ ప తికి రాదు. కాని సరిగ్గా సంవత్సరం క్రిందట ఆమెను చూచి నపుడు నిజంగా నన్ను నేను మరచిపోయే స్థితి కలిగింది. ఆమెవైపు అలానే చూస్తూ నిలబడిపోతే, ప్రక్కనేవున్న ఆమె నాన్నగారు 'నే నెందుకలా అయిపోయానో?' అన్న తలంపులోనేమో నా పరిస్థితిలో పాలుపంచుకొంటే అతనిని యిరకాటంలో పడవేయటం యిష్టంలేక, ఆ ప్రవర్తనలో సభ్యత లోపించింది గనుక, 'అబ్బే! ఏమీలేదండీ!' అంటూ కుర్చీలో కూలబడ్డాను.

"ఏంవమ్మా? మేము సకాలములోనే వచ్చామనుకొంటాను. ఏదైనా కాస్త నాలుకను తడిచేసే పని వుందా లేదా?" అని ముద్దుముద్దుగా అడిగాడు. చిరు నవ్వు సమాధానంగా ఆమె లోనికివెళ్ళింది. కుర్చీలో కూర్చున్నానేగానీ, ఆలోచనలు ఆవురావురుమంటున్నాయి ఆకలిగొన్న ప్రేవుల్లా.

"నా రెండవ కుమార్తె-బి.ఎ. చదువుతూ ఉంది. పేరు జయలక్ష్మి!"

పరిచయవాక్యాలు చెవిని పడడంతో తల పైకెత్తాను వ్యక్తికోసం. ఎవరూ కనుపించలేదక్కడ. లోనికి వెళ్ళిన అమ్మాయినిగురించి అనుకొని 'ఓహో! అలాగా' అన్నాను. పేరు చెవిని పడడంతో నా ఆశ్చర్యం

ఇంకా శ్రుతిమించుతూనే వుంది. ఆలోచనలు ఆశ్చర్యంతో పోటీపడుతున్నాయి.

"ఇదో ఈ పేపరుచూస్తూ ఉండండి. అంతలో అమ్మాయి కాఫీ తెస్తుంది. నేనూ వచ్చేస్తా!" అంటూ జయలక్ష్మి తండ్రిగారు లేచివెళ్ళారు. ఆ రోజుకూడ యిలాంటి ఒంటరితనమే! అయితే ఆ రోజు కుర్చీలో, ఈ రోజు స్టూలుమీద కూర్చుని ఉన్నాను. కుర్చీనుండి స్టూలువరకు రావడం సంవత్సరంపాటు పరిచయభాగ్యమేమో మరి! ఓ మూల రెండు మూటల ధాన్యం....'కిచకిచ' లాడుతూ పిచ్చుకలూ....నట్టింటిగూటికి నాలుగుజానెళ్ళ ఎత్తులో నలుగురు దేవుళ్ళు—వాతావరణంలో యేమార్పు కనిపించలేదు కానీ, ఆనాటి నా మనఃప్రవృత్తికి ఈనాటికీ ఎంతో తేడావుంది.

అదేమి చిత్రమో కానీ కొందరిని చూస్తుంటే పరవశులవుతాము. మరికొందరు మాట్లాడుతూంటే మైమరచిపోతాము. కానీ కొందరిపేరు చెవిని పడితే చాలు!—వివశులై పోతాము.

నాకు ఒక మిత్రుడున్నాడు. నాకేగాదు అందరికీ మిత్రులుంటారు. అయితే ఉపయోగపడకపోయినా కనీసం ఉదహరించుకోగల మిత్రులు చాల తక్కువమందికే దొరుకుతారు. అతని ఆకారాన్ని పోల్చుకోవడానికి అనంతమైన సృష్టిలో ఎన్నో వస్తువులు కనుపించినా అతనిని ఓ సూదిలాంటి మనిషి అని చెప్పుకొంటే, అతగాడి చదువు ఆ సూదిబెజ్జమంత. కానీ అతడు మాట్లాడుతూంటే, సూదిబెజ్జం భూగోళాన్నే మరిపిస్తుంది. పుస్తకాల పురుగై అతడు సాధించిన ఘనవిజయం అది! అతడొక అమ్మాయిని ప్రేమించాడు. కాదు—ఆమే అతనిని ప్రేమించిందట! ప్రేమించవలసివస్తే ఎవరో ఒకరు ప్రేమిస్తే మరొకరు ప్రేమింపబడతారు. ఇది సర్వసాధారణంగా జరిగే విషయం. దాని తాడుతెగ - ఈ ప్రేమకూడ డాక్టరు డాక్టర్నే, గుమాస్తా గుమాస్తాలనే, కాలేజీ వాళ్ళు కాలేజీవాళ్ళనే ప్రేమించేటట్టు చేస్తుంది. కానీ మావాడి విషయంలో పప్పులో కాలువేసింది. ఆమె

ఓ తెలుగు లెక్చరర్!— పేరు 'తార'ట! ప్రేమ వీళ్ళ చేతుల్లో పడి గుడ్డిదని పించుకొనింది. వీళ్ళ ప్రేమ తారస్థాయి నందుకొన్న కొన్నిరోజులకు ఆమెకు మార్పురావడంతో వెళ్ళిపోయింది. పోతూపోతూ ఊరకేపోకుండా మా వాణ్ణి తల మునిగే విరహంలో పడవేసిపోయింది.

తల్లి బిడ్డను ఓదారుస్తుంది. ప్రేయసి ప్రియుణ్ణి ఓదారుస్తుంది. పాప భీతి కల వాళ్ళను వేదాంతులు ఊరడిస్తారు. ఓటుచేత పట్టుకొన్న గొర్రెదాటు ప్రజలను ఎన్నికల్లో వేదికలెక్కి మహా నాయకులు ఓదారుస్తారు. విరహతాడి తుని కంట తడిని స్నేహితుడు తుడుస్తాడు. ఆ బాధ్యత నాపై బడింది. నా మాటలన్నీ సావధానంగా విన్నట్లుగానే వుండి కడపట అతడనేవాడు, "గురూ! తగిలిన కాలికే తెలుస్తుంది బాధ. నా పరిస్థితిలో మీరుంటే అలా చెప్పేవారుకాదు. చెప్పడానికేముంది? — చెత్త చెదారాన్నికూడ చలామణి చేయవచ్చు చెప్పగలిగితే! కానీ, ఎటుచూచినా ఆమె స్వరూపమే! ఎటు తిరి గినా ఓ సంఘటన కనులముందు మెదలుతూ ఉంటుంది. ఎలా మరచిపొమ్మం టారు చెప్పండి? కనీసం ఏదైనా పుస్తకం చదువుకొంటూ మరచిపోదా మంటే, ఏ వాక్యంలోనైనా సరే, 'త' వర్ణం కనుపిస్తే చాలు. దీనికి దీర్ఘ మిస్తే 'తా' అవుతుంది. ప్రక్కన 'ర' వ్రాస్తే 'తార' అవుతుంది. నా తార!- ఇంతెందుకు? - 'త'కు యిటువైపు అటువైపు యే అక్షరం కనుపించినా ఇన్ని అక్షరాలు ముందుకు వెళ్ళితే, లేదు వెనక్కువస్తే 'త' వస్తుంది. దీనికి దీర్ఘమిస్తే 'తా' అవుతుంది. ప్రక్కన 'ర' వ్రాస్తే 'తార' అవుతుంది. 'నా తార! నా తార!!' అని పలవరించే హృదయం చదువులో లీనమవుతుం దంటారా? ఏమో?" అని అసలే లోతుకు వెళ్ళిన కనుగ్రుడ్లను పూర్తిగా కన్నీటితో నింపేవాడు. ఎదురుగా నవ్వలేకపోయినా, తలదన్నే అతని భావనా శక్తికైనా నవ్వుకొనే వాణ్ణి పరోక్షంగా. కాని నాకు యిప్పుడు తెలిసివస్తూ ఉంది పేరులో వున్న మాధుర్యం. అతడన్నట్లు తగిలితేనే తెలిసింది ఆ బాధ!- జయలక్ష్మి! ఒక్కటే ఒక్క అక్షరం వ్రాస్తే చాలు 'వి' అని ఆ పేరు ముందు. 'విజయలక్ష్మి' అవుతుంది.

కథా నిలయం
12 61 24
శ్రీకాకుళం

ఖా (ఖీ) మా క లా పం

విజయలక్ష్మి నా హృదయ సామ్రాజ్యలక్ష్మి!

మత్తుమందు చల్లి మంత్రముగ్ధుణ్ణి చేసి యేదో వేడి పుట్టించగల వాడిచూపులు....వాటితో పోటీపడుతూ చిరునవ్వులు....నవ్వితే అరుణరాగ రంజితాన్ని జవురుకొనే బుగ్గలమీది సొట్టలు....వీటన్నిటినీ కాలతన్నే అంగ సౌష్ఠవం—ఆమె ఒక్కసారి అలా విలోకిస్తే చాలు! మానవుడు అమాంతంగా పై కెగిరిపోతాడు - ఊహాలోకంలో పౌరసత్వపు హక్కు సంపాదించుకోవడానికి!

అలాంటి విజయలక్ష్మికి నాకు పరిచయం కలిగింది చాల విచిత్రంగా. మా ఆఫీసుకు వెళ్ళేదారిలో రామాలయముంది. ఆఫీసుకు పోతూ పోతూ ఆలయం ముందు నిలబడి చేతులెత్తి నమస్కరించేవాడిని. కాళ్ళల్లో చెప్పులు తీసివేయడం....చెంపలు 'పెళపెళ' వాయించుకోవడంలాంటివి పొరపాటున కూడ మరచేవాణ్ణికాదు ఆ సమయంలో. అది రామునిమీద భక్తితో మాత్రం అవునో కాదో తెలియదుకాని, మా ఆఫీసరుగారి తిట్లపై భయంతో మాత్రమని నిస్సందేహంగా చెప్పవచ్చు. పదిపైసల టీ, లేకుంటే పావలా కాఫీతో మా హెడ్‌గుమాస్తాగారి హెడ్ సరిచేయవచ్చునేమో కానీ, ఆఫీసరు మాత్రం అసాధ్యుడు. అందుకే రాముని శరణు వేడాను. అతడు కూడ ఒక్కొక్కప్పుడు పెడచెవిని పెడుతున్నాడు. వాడి కెన్నిపనులో మరి!—

ఆ రోజు భక్తి మోతాదు—కాదు భయం మోతాదు కాస్తమించింది. 'ఈ రోజుకు నన్నెలాగైనా రక్షించు రామా!' అని మనసార వేడుకొన్నాను. అంతవరకు నెలసరిలెక్కలు పైవారికి పోలేదు. ఆనాడు ఎలాగూ ఆఫీసరుగారి వడ్డనలు తప్పవని నాకు బాగా తెలుసు. నా సంకటాన్ని ఆ సర్వేశ్వరునికి నివేదించుకొంటూ ఎంతసేపు వున్నానో తెలియదు కానీ, కన్నులు తెరచిచూచేటప్పటికి నేను నమ్మలేని దృశ్యం!....ఎదురుగా దివి నుండి భువికి దిగిన సౌందర్యరాశి!!—ఆమె కూడ అంతవరకు రామునితో యేమని విన్నవించుకొనిందో తెలియదుకానీ, అరమోడ్పు కన్నులతో,

మొక్కుతున్న చేతులతో ఈ లోకంతో ప్రమేయాన్ని కోల్పోయిన పరిస్థితిలో—నా ఎదురుగా ఆమె! ఆమె ఎదురుగా నేను!! నా స్థితిలో ఆమె! ఆమె స్థితిలో నేను!?....అరవిరిసిన మొగ్గల్లాగ విచ్చుకొంటున్నాయి ఆమె పెదవులు. మెరపులాంటి ఓ చిరునవ్వు తళుక్కుమనింది ఆ పెదవుల మధ్య. నా తల మెల్లగా వాలింది. సిగ్గుతోకాదు—ఆనందంతో నిండిపోయిన హృదయాన్ని చూచుకోవాలని! ఆమె మెల్లగా కదిలింది. నేను అంతే!—

అయితే చిన్నబజారంతా కదిలినట్లుంది ఆమెతో కలిసి. అత్తరు అమ్ముకొనే అబ్దుల్లా సాహెబ్, బేరాన్ని అవతలికి నెట్టి, ఆమెవైపు అదోలా పోజుపెట్టి, మెల్లగా సవరించుకొంటున్నాడు మేకపోతు గడ్డాన్ని, అంతకు మించిన గాంభీర్యాన్ని! పేవ్‌మెంటు మీద పాత బట్టలుకుట్టి పొట్టపోసుకొనే 'సత్తారుభాయి' సత్తువకొద్దీ తొక్కుతున్నాడు కుట్టుమిషను. 'బలె బలె కత్తులు! పదునైన కత్తులు!! పావలా కత్తులు!!!'—అని అరుస్తూ వీధి వీధి తిరుగుతూ కత్తులమ్ముకొనే కపిలేని ముసలికూడ అదోరకంగా చూస్తూ, 'బలే కత్తి!' అని అరుస్తున్నాడు. నేను మాత్రం చాల జాగ్రత్తగా దాచుకొన్నాను గుండెల్లో ఆమె చిరునవ్వును. మనసు ఎటువైపో తేలిపోతూ ఉంది. ఆఫీసులో పనికూడ హుషారుగా సాగుతూ ఉంది. ఆ ముందునాడు ఎంత ప్రయత్నించినా తలాతోక లేకుండా తయారైన లెక్కలన్నీ చెప్పిన మాట వింటున్నాయి, చేతులు ముడుచుకొన్న నమ్మకమైన నౌకరువలె. అది రాముని అనుగ్రహమో? ఆమె చిరునవ్వుల ప్రభావమో? ఆ రామునికే ఎరుక కానీ, ఆ రోజు దొరగారి దీవెనలు తప్పడం నా అదృష్టం!

ఆ రోజునుండి అంతే! చిన్న బజారులో నేను ఆఫీసుకు వెళ్ళే సమయంలో ఎదురుపడుతుంది. ఉదయమో, సాయంత్రమో కనీసం ఒక్కసారైనా కనిపిస్తుంది తప్పనిసరిగ. చూడబోతే ఆమెకూడ నా లాగ పొట్ట చేత పట్టుకొని ఓ ఆఫీసుచుట్టూ కాదు కానీ, ఆఫీసులో గడియారం చుట్టూ తిరిగేటట్టుగా వుంది. ఎదురుపడ్డప్పుడంతా ఒక్కసారి నా వైపు చూస్తుంది. అతి

జాగ్రత్తగ చిరునవ్వు దోచుకొంటాను. యథాలాపంగా నా తల వాలిపోతే మనస్సు ఊహాలోకాల్లో తేలిపోతూ ఉంటుంది.

దుర్భరమైన బ్రతుకులో దినం ఓ యుగమనిపిస్తే, ఈ ఆనందానుభూతిలో ఆరు నెలల జీవితం 'అరదినం'లాగ గడిచిపోయింది!

ఆ నాడు - సాయంకాలం అయిదుగంటలై ఉంటుందేమో? ఆఫీసు పనిమీద చిత్తూరువెళ్ళి తిరిగిరావడానికి బస్సుస్టాండుకు వచ్చాను. పనులన్నీ సవ్యంగా జరిగిపోయినా, మనస్సు మాత్రం పరితపిస్తూనే ఉంది. ఆ తపనలో కలిసి ఆలోచన!—కొంపలు కూల్చేది, నిలబెట్టేది కోమలాంగుల చిరునవ్వులే అని అంటారు. ఆశావాదులపాలిట వరప్రసాదం చిరునవ్వే!—మరి ఆ చిరునవ్వు ఆ రోజు నాకు దూరమయ్యేసరికి ఏదో ధారపోసుకొన్నంత తపన—

'బస్సుస్టాండు'లో అడుగుపెట్టాను. ఎటు చూచినా యేదో రంపు!.... అంతా కలగాపులగంగా కలిసి - అదొక ప్రత్యేక ప్రపంచంలా, నేటి రాజకీయ వాతావరణానికి దర్పణంలా ప్రతిబింబిస్తూ ఉంది. సాధారణంగా బ్రతిమలాడించుకొనే 'కండక్టరు' మహాశయుడు....కొన్ని కొన్ని సమయాల్లో పిలుపును పెడచెవిని పెట్టగల కాకిగుడ్డల ధీరుడు .... సాదరంగా ఆహ్వానించాడు - ఒక్కటంటే ఒకటే సీటు మిగిలివుందని. బస్సు ఎక్కాను. నాకంటే ముందు వచ్చినవాళ్లు ఆక్రమించుకొన్నారు సీట్లన్నింటినీ: లేదంటే—ఒక వరుసలో యిద్దరు స్త్రీలు కూర్చుని వున్నారు. ఆ ఖాళీగావున్న ఒక్క సీటు నాకు యివ్వడం సమంజసము కాదు. ప్రక్కన కూర్చున్నవాళ్ళు ఆడవాళ్ళు కదా మరి! పరిష్కార మార్గానికై తికమక పడుతూ ఆలోచిస్తున్నాడు కండక్టరు. అతని ప్రక్కన నేను. కూర్చున్న సహృదయులెవ్వరో బోలెడు ఉచిత సలహాలిస్తున్నారు. ఈ అలజడితోనేమో తిరిగి చూచింది ఆమె!—నా కన్నులు నేనే నమ్మలేకపోయాను. ఇంతసేపు దేనికోసం పరితపించానో అవే చిరునవ్వులు! అరవిరిసిన మల్లెలై

నాకు అభిషేకం చేస్తున్న పువ్వులు! యథాలాపంగా నా తల వాలిపోయింది. "అరె! మీరా? ఎప్పుడు వచ్చారేమిటి? రండి! రండి!!'—అని సాదరంగా ఆహ్వానించింది ఆమె.

"మీ వాళ్ళండీ వాళ్ళు?" కండక్టరు అడుగుతున్నాడు.

"అవునండీ!" అన్నాను అనకపోతే బావుండదని.

"అయితే అదే సీట్లో కూర్చోండి"—అతని నెత్తిబరువు నేలపడిన ట్లుంది.

"రైట్" అని గొంతు చించుకున్నాడు. ఆమె ప్రక్కన కూర్చోవలె నంటే యేదోగా అనిపించి నసుగుతూ నిలబడ్డాను ప్రక్కన్నే.

"బాగుందండీ? అసలు సిగ్గుపడవలసింది మేము. మా పని మీరు చేస్తున్నారు కాబట్టి, మీ పని మేము చేయవలసి వస్తుంది. రండి! రండి!! ఇలా కూర్చోండి!" అని ఆమె ఒత్తిడిచేస్తూ ఉంది. ఒదిగి కూర్చున్నాను. నా రెక్క పట్టిలాగి సరిగ్గా కూర్చోపెట్టింది. బస్సు కదిలింది. నా హృదయం అక్కడ వుందో లేదో ఒక్కసారి తడిమిచూచుకోవలసి వచ్చింది. ఉంది. లేదంటే ఎటో తేలిపోతూ వుంది. బస్సు అంతకంటె వేగంగా పరుగు లిడుతూ వుంది.

పేరు విజయలక్ష్మి. నేను ఊహించిన తీరుగానే ఆమెకూడ ఓ గుమాస్తా. చిత్తూరులో ఆ రోజు బంధువుల యింట్లో యేదో కార్యం జరుగుతూ ఉంటె చూచిపోవడానికి వచ్చిందట! ఈ పరిచయంతో ప్రారంభమైన సంభాషణ బస్సు గమ్యస్థానం చేరేసరికి ఎక్కడికోవెళ్ళి నిలిచింది. నిజంగా ఆ నాటి బస్సు ప్రయాణం జీవితంలో ఓ మరపురాని సంఘటన. ప్రభుత్వం వారి ధర్మమా అని ఎక్కడపడితే అక్కడ 'రిపేరు' పేరుతో గుంతలు గుంతలుగా వుంది బాట. బస్సు ఆ గుంతల్లోపడి గల్లంతు చేస్తూంటె, మాకు తెలియకనే మా శరీరాలు ఒకదానితో వొకటి 'ఢీ' కొంటూంటే, ఇది గమనించనట్లు యిద్దరమూ మాటల్లో పడినట్లు నటిస్తూంటె, ఎప్పుడో నలభై

మైళ్ళ ప్రయాణం జరిగిపోయింది—నలభై యేళ్ళు కలిసి బ్రతికినంత ఆనందాన్ని అందిస్తూ!

ఆ రోజు 'బస్సు'లో 'సీటు' యిచ్చిన 'కండక్టరు' మహాశయునికి, బాటంతా గుంతలు గుంతలుగా ఉంచిన ప్రభుత్వానికి కృతజ్ఞత తెలుపడం నా కనీస కర్తవ్యం. లేకపోతే నా విజయలక్ష్మి!....నా ఆనందాల ప్రోవు!! నాకు దొరికేది కాదేమో? ఆ నాటినుండి నాలుగేండ్లు నాలుగు దినాల్లాగ గడిచి పోయాయి. ఆ నాలుగేండ్లలో ఎన్ని సినిమాలు....ఎన్ని చిత్తూరు ప్రయాణాలు....ఎంత చిత్తుగా తిరిగాము....ఓహ్! తలచుకొంటే గుండె మధురానుభూతితో నిండి మాటలు పెగిలిరావు. ఇంతకూ అనుకొన్నది అనుకొన్నట్లుగా జరిగితే యింత ఆలోచన అనవసరము. అనుకోని విధంగా జరిగినపుడే ఈ నెమరువేయడాలు....నీళ్ళు మింగడాలూ!....

నాలుగేళ్ళ తరువాత ఓ ఉదయం అవసరమైన పని యేదో తగిలింది. అయిందనిపించేటప్పటికి దాదాపు పదికావస్తూ ఉంది. ఇంకా ఆలస్యమైతే నా ఆరాధ్య దేవతాదర్శనం లభించదేమో అని తొందర తొందరగ పోతున్నా! పెద్ద మఠం దాటిపోయింది. రామాలయం....పోలీస్‌స్టేషన్....దాటిపోతు తున్నాయి. ఈ రోజు శ్రీరామచంద్రుడికి నామీద చాలకోపం వచ్చి ఉంటుంది. అసలు రోజూ పెట్టే నమస్కారమే చిత్తాన్ని ఎక్కడో పెట్టి! మరీ ఈరోజు అంతంతమాత్రంగా తయారయింది. పరుగు నడకగా దూసుకుపోతున్నాను— ఏదో పుట్టిమునిగినట్టు! ఊరి పొలిమేరలు దాదాపు సమీపిస్తున్నాయి. ఇంకో పదిబారల దూరంలో మా ఆఫీసు ఉంది. ఆమె కనుపించలేదు! నడుములు విరిగినంత పనికాగా, 'బహుశా ఈవేళ తొందరగ ఆఫీసుకువెళ్ళి ఉంటుందేమో!' అని నా మనసును సమాధానపరుచుకొంటూ కుర్చీలో కూలపడ్డాను.

'అయ్యగారేమో యీ వేళ....'—హెడ్‌క్లార్కుగారి పరామర్శ ప్రారంభమయింది. అసలే విసుగ్గా వున్నాను. ఎంతో సౌమ్యంగా అడిగిన

ట్లున్నా పుండుమీద కారం చల్లినట్లు వినిపిస్తున్నాయి మాటలు. 'కాస్త పని వుండిందిలే స్వామీ!' అని నాలో నేను సణుక్కొంటూ, బల్లమీద కాగితాలు సర్దుకొంటున్నాను. అంతలో ఆఫీసుజవాను తపాలా అందరికీ బట్వాడా చేస్తూ నాకు ఒక కవరు అందించాడు. విప్పాను. అది శుభలేఖ. అందంగా అచ్చువేయబడిన ఆ లేఖ సారాంశం నన్ను పెళ్ళికి ఆహ్వానించడం.... ఎవరో కాదు నేను 'నా' అనుకొంటూ ఉండిన విజయలక్ష్మి!

గుండె ఆగిపోయినట్లయింది. కానీ తలమాత్రం తిరుగుతూ ఉంది. రంగులరాట్నంలో కూర్చుంటే ప్రపంచమంతా తిరుగుతున్నట్లు కనిపిస్తుంది. నాకేమో ఆఫీసంతా తిరుగుతున్నట్లుంది. ఎంత ప్రయత్నించినా తేరకునిండు కొంటున్నాయి కండ్లు. ఆ స్థితిలో ఎట్లో నాలుగంటే నాలుగు వాక్యాలలో ముగించాను సెలవుచీటి. 'హెడ్ క్లార్క్ టేబిలు'మీద పడవేసి మారుమాట్లాడ కుండా బయటికి నడిచాను. పాపం! ఆ ముసలాడు నన్ను, నా పరిస్థితిని అర్థం చేసుకోలేక అవస్థపడుతూంటే! ఎటు పోవడానికి తోచలేదు. 'ఛీ! ఈ ఆడవాళ్ళంతా యింతే! నవ్వుతారు. నవ్విస్తారు. ఆపైన కవ్విస్తారు. కమ్మగా అంతకంటే నమ్మకంగా పలుకుతారు చిలుక పలుకులు. తీరా దగ్గర చేరితే దవడపళ్ళు రాలగొడతారు!—లేకపోతే యేమిటిది? రెక్కపట్టి లాగి ప్రక్కన కూర్చోబెట్టుకొనింది తానే! నవ్వించి కవ్వించిందీ తానే! తాను లేకుండా బ్రదుకలేనన్న స్థితికి తెచ్చింది తానే! మరి ఎందుకింత నిర్దాక్షిణ్యంగా, మాటమాత్రం నాతో అనకుండా ఈ పని చేయగలిగింది. పైగా సాయంకాలం అయిదుగంటలకు కపిలతీర్థం వద్ద కలుసుకోవాలట!....సిగ్గు లేకపోతేసరి!'

ఆఫీసు బయటపడి, ఆమీదట తడబడి, మార్గం తెలియనికాళ్లు యిష్టమొచ్చినట్లు తిరుగుతున్నాయి. మనస్సు మరుగుతూ ఉంది ఆలోచనలతో.

మంచి వయసులో మార్గం తప్పిన మగువ కోరికలవలె అంతవరకు నన్ను తపింపచేసిన సూర్యకిరణాలు అయిదుపదులు దాటిన అమ్మ పల్లె

దనాన్ని ఆహ్వానిస్తున్నవేళ. ఉదయం ఎప్పుడో త్రాగిన కాసిని కాఫీ నీళ్ళు....ఉదయంనుండి దారీతెన్ను లేకుండా చెడతిరిగిన కాళ్ళు....ఒళ్ళు వశంతప్పి పోయేస్థితి—ఆ చోటు చల్లగావుంది. కొండగాలులు మెల్లగా మధురాతి మధురంగా వీస్తున్నాయి. పోయినప్రాణం లేచివచ్చినట్లనిపించి కూర్చున్నాను. బైర్లు కమ్ముతూండిన కళ్ళకుకూడ కాస్త తెరపి చిక్కినట్లనిపిస్తూ ఉంది. పరిసరాలు ప్రస్ఫుటంగా కాకపోయినా కనిపిస్తున్నాయి. నిదానించిచూశాను. అది కపిలతీర్థం! నేను కూర్చున్నది ఓ మండపములో. నాకు నాకే ఆశ్చర్యం వేసింది. ఇకమీదట విజయలక్ష్మి మొగమే చూడకూడదనుకొన్నాను. కానీ నాకు తెలియకనే నా కాళ్లు నన్నక్కడికి చేరవేశాయి. అందుకేనేమో ఆడవాళ్ళకంత అహం!

మండపంలో ఓ స్తంభానికి చేరగిలబడి వున్నాను. తిరుమలకొండ నుండి వస్తూపోతూవున్న బస్సులు....కార్లు....ఒకటే రొద చేస్తున్నాయి. అలవికానన్ని అన్యాయాలను అక్రమాలను చూచి చూచి విసిగిపోయాడేమో సూర్యుడు—అతని మొగంకూడ పాలిపోయివుంది నాలాగానే! 'ఇక చూడ లేను బాబూ!' అంటూ కనులు మూశాడు పడమటికొండలమాటున. ఇక ఆలోచించలేనంటూ మనస్సు అలసిపోతే కన్నులు మూతలుపడ్డాయి నాకు తెలియకుండానే!—

అలా ఎంతసేపు గడిచిందో తెలియదు. ఏదో చల్లని స్పర్శకు అదిరిపడింది ఒళ్లు. మెల్లగా కళ్లు తెరచాను. ఎదురుగా....అవే చిరునవ్వులు!— అంత నీరసములోకూడా ఒళ్లు రగిలింది. లాగి ఓ చెంపదెబ్బ కొడదామన్నంత కోపం వచ్చింది. కానీ అదేమిచిత్రమో ఆ చిరునవ్వుల తాకిడికి మనస్సు చిత్తయిపోతే, శరీరం చేతనారహితమైన చిత్తరువులా అయిపోయింది. అది నా బలహీనతనా? వాంఛనా? ప్రేమా? ఎఱుగలేని స్థితిలో తల వాలిపోయింది.

'కిలకిల' నవ్వింది ఆమె!

కోటి వీణలు మీటినట్లు, కోయిలలు కూసినట్లు ఎంతో మధురాతి మధురమైన అనుభూతినిచ్చే ఆ నవ్వు! నరాలను జివ్వుమనిలాగే ఆ నవ్వు!! సౌగంధ్యసౌరభాలలో నన్ను ముంచియెత్తే ఆ నవ్వు!!!—మరొకప్పుడైతే నా బాహువలయంలో ఆమెను యిరికించుకొని ముక్కోటి ముద్దులతో మురిపించి, ఉక్కిరిబిక్కిరిచేసివుండేవాణ్ణి. కానీ యిప్పుడేమో కోతి యికిలించినట్లు, కావెక్కిన గుర్రం సకిలించినట్లు, కృతకంగా వినిపిస్తూ వుంది. నాకేమీ పట్టింపులేనట్లుగా కూర్చున్నాను మూతి ముడుచుకొని.

రెక్కపట్టి పైకి లేపడానికి యత్నించింది. ఇంకా అదే చొరవ. అదే సాహసము. నాకేదో ఎబ్బెట్టుగా తోచి విదిలించుకొన్నాను. ఆమెను చూడడానికి కూడ మనస్కరించకుండా తల వాల్చుకొన్నాను. సున్నితంగా, మొనదేలిన మునివ్రేళ్ళు నా గడ్డాన్ని అలా మెల్లిగా పైకి లేపాయి.

అబ్బ! మళ్ళీ అవే చిరునవ్వులు....హృదయాన్ని గిలిగింతలుపెట్టే చిరునువ్వలు?

చూడలేకపోతున్నాను.

వాలిపోలేని తల, ఆమె మునివ్రేళ్ళ మీద తలపులలో తేలియాడుతూంది.

'నా మాట వినవూ?....రావూ?....' అని దీనంగా బ్రతిమలాడుతున్నట్టున్నాయి చూపులు. 'ఇదో యిటు రా!' అని సూదంటురాయిలా ఆకర్షిస్తున్నాయి చిరునవ్వులు.

ఆమె ముందు. నేను వెనుక. అమ్మ వెంట బిడ్డలా! ఆవు వెంట దూడలా!!—చీరకుచ్చెళ్ళు సవరించి కోనేటిలో దిగింది. మొదటి మెట్టు మీద నిలబడింది. మడమలను తడుపుతున్నాయి నీళ్లు. కనుచీకటి ఆవరిస్తున్న వేళలో నీలిరంగు నీళ్ళల్లోని తెల్లటి పాదాలతో చెప్పలేనంత సంతోషంతో ఆడుకొంటున్నాయి చేపపిల్లలు ఆమె చిరునవ్వులవలె. పై మెట్టుమీద నేను నిలబడి వున్నాను. కాళ్లు చేతులు మొగము కడుక్కొనింది. ఒక్కసారి

తిరిగి నావైపు చూచింది. గత నాలుగేళ్ళుగా చదువుతూనే వున్నాను—ఆ చూపుల్ని.

'ఇంకా అలా నిలబడ్డావేం? నీవూ కానీ!'—అన్నట్లు ఆజ్ఞాపిస్తు న్నాయి. నేనూ అదేపని చేయకతప్పలేదు. అయితే ఆమె నవ్వుతూ మొగం కడుక్కొనింది. నేను అంతసేపు యేడ్చి మొగం కడుక్కొన్నాను.

కొండ క్రింద కోనేరు. కోనేటి గట్టుమీద కొండచరియపైన గుడిలో కపిలేశ్వరుడు. బిల్వదళార్చనచేస్తూ విప్రోత్తముడు! ధ్యానమగ్నులైనట్లు నిలబడివున్న ఓ గుంపు. ఆ గుంపులో కలిసి మేము—ఆ దేవునికి యేమని విన్నవించుకుందో ఏమో, నాకు మాత్రం ఏమీ తోచలేదు.

ఎండి బీటలువారిన చవిటి నేలలో విత్తనాలు మొలుస్తాయా?

బయటపడ్డాను - బాధలోనుండి కాదు గుడిలోనుండి. ఆమె నడుస్తూ వుంది. ఆమెవెంట నేనూ నడుస్తూనే వున్నాను. ఆలయాని కల్లంత దవ్వులో, అలనా పాలనా లేకుండా పెరిగిన పొడిచెట్ల మధ్యలో, నలుగురి కంట్లో పడనిచోట ఆమె కూర్చునింది. ఎదురుగా నేనూ కూర్చున్నాను, కాదు—ఆమే కూర్చోబెట్టింది. అంతవరకు ఎట్లో ఆగి, ఎదలోనే రొద చేస్తూ ఉండిన ఆవేదనాస్రవంతి కట్టలు త్రెంచుకొని పొంగి పొర్లితే ముందుకు సాగనీయకుండా అడ్డుపడింది ఆమె వక్షస్థలి!

కనుచీకటి ఆవరించింది. దానిని పారద్రోలడానికి వ్యర్థప్రయత్నం చేస్తున్నాయి విద్యుద్దీపాలు. అంతవరకు 'కిచకిచ'మని అరుస్తూ, ఎగిరెగిరి గంతులిడుతూ, ఒకదానితోనొకటి పోటీపడుతూ స్వేచ్ఛగా తిరుగుతున్న కోతులుకూడ ఆశ్రయంకోసం వెదుక్కొంటున్నాయి. అల్లంతదవ్వులో కపిలేశ్వరాలయ ప్రాంగణములో విప్రోత్తముల వేదపాఠం వీనులవిందుగా వినిపిస్తూ ఉంది. ఎదమీద చెవిపెట్టి ఎంత ప్రయత్నించినా విజయలక్ష్మి గుండెల్లో యేముందో వినిపించలేదు. అలా ఎంతసేపు గడిచిందో తెలి యదు. ఆమె తొడమీద నాతల వాలిపోయివుంది. కన్నీళ్ళు అవిచ్ఛిన్నంగా

కారుతూనే వున్నాయి. ఆమె వ్రేళ్ళు ఆడుకొంటున్నాయి నా వెంట్రుకలతో!

'ఏడుస్తున్నావా?'—లాలనగా అడిగిం దామె.

తెలిసి అడుగుతూవుంటే బదులుచెప్పడం అనవసరమనిపించింది.

'పిచ్చీ! ఈ నా మాటలు జాగ్రత్తగా విను. అంతకంటే జాగ్రత్తగా ఆలోచించు. అర్థం చేసుకోగలిగావా అంతకంటే ఆనందంలేదు. అర్థంకాకపోతే నన్ను క్షమించు.'

ఆమెవైపు చూస్తున్నాను ఆశ్చర్యంగా.

"అవును పిచ్చీ! నీకు ఆశ్చర్యంగా తోచవచ్చు. 'ఏమిటీపిల్ల యింత బరితెగించి మాట్లాడుతూందే' అని అనిపించవచ్చు. కానీ యివి నేర్చుకొన్న మాటలుకావు. చదువుకొన్న మాటలు అంతకంటే కావు."

తొందరగాకానీ నీ సోదె అన్నట్లు చూశాను ఆమెవైపు. కారణం కోసం తహతహలాడే మనసు సహనాన్ని కోల్పోతూ ఉంది.

"చెబుతున్నా విను. ప్రేమ వేరు. కర్తవ్యం వేరు. ఒకదానికొకటి ఆమడలదూరాన నిలబడి వుంటాయి. ప్రేమలో కర్తవ్యం యిమిడినా, కర్తవ్యంలో ప్రేమ కుదిరినా సంతోషమే! కానీ పరిస్థితుల ప్రభావంతో రెండూ రెండుగా ఈనెపుల్లలా చీల్చబడినపుడు దీనికోసం యేడవడం పిచ్చిరా పిచ్చీ! నిన్ను నేను ప్రేమించాను. నీవూ ప్రేమించావు. దీనిలో కర్తవ్యం ముడివడివుంటే బాగుండేది. కానీ మనం మానవులం. విధి చేతుల్లో బానిసలం. ఏటికి యెదురీదడ మెందుకు? ఎదురుదెబ్బలు తినడమెందుకు? ఈ మధురాతిమధురమైన అనుభూతిని నెమరువేసుకొంటూ మన కర్తవ్యాన్ని మనం నెరువేరుద్దాం. లే!" అంటూ తానులేచి, నన్నుకూడ లేపి, అక్కడే ఆ చీకటిలోనే వదలిపెట్టి వెళ్ళిపోయింది.

ఆ రోజునుండి ఆలోచిస్తున్నాను అర్థం చేసుకోవడానికి. చిక్కినట్లే దక్కినట్లే శ్రీరాముడిపాలిట బంగారులేడిలా నన్ను ఎక్కడికో మరెక్కడికో తీసుకొని వెళుతూనే వున్నాయి ఆ మాటలు.

ఆ తరువాత ఎవరూ చూడనిచోట ఏకాంతంగా కూర్చొని యేడ్చాను. ఓపిక ఉన్నంతవరకు రోజూ యేడ్చాను. ఓపిక సన్నగిల్లిందో—లేదు, కన్నీళ్ళు యింకిపోయాయో తెలియదు కానీ, ఆపై కూర్చున్నచోటంతా ఆలోచించడానికి ఆరంభించాను. ఇటు యింట్లో అటు ఆఫీసులో నా పర ధ్యానానికి తగిన ప్రాయశ్చిత్తం జరిగేసరికి కాస్త తెలివిగా వ్యవహరించ డానికి పూనుకొన్నాను ప్రయత్న పూర్వకంగా. గత అనుభవాలు అప్పు డప్పుడు కనులముందు మెదులుతూ, 'కలలేమో?' అనిపిస్తూ ఉన్నాయి. రోజులు దొర్లుతున్నాయి భారంగా!....

ఆ రోజు. ఈ నాటికి సరిగ్గా యేడాది క్రిందటి రోజు. ఈ యింట్లో అడుగుపెట్టిన మొదటి రోజు. జయలక్ష్మి నా యెదుట పడ్డరోజు!— నిజంగా నన్ను నేను మరచిపోయాను. గతస్మృతులన్నీ మనసులో మెదిలి నన్ను అచేతనుణ్ణి చేశాయి కాసేపు. దీనికి కారణం—జయలక్ష్మి దాదాపు నా విజయలక్ష్మిలాగే వుంది!

అవే కండ్లు! అవే చిరునవ్వులు!....నవ్వితే అరుణరాగరంజితాలను జవురుకొనే అవే బుగ్గలమీది సొట్టలు. 'నా అదృష్టదేవత, ఆరాధ్యదైవము మళ్ళీ ఈ రూపంలో అవతరించిందా!' అని విస్తుపోయాను. అందుకే ఆరు నెలలు తిరిగాను ఆమె యింటిచుట్టూ. ఆరునెలల్లో అరవైసార్లు చూశాను ఆమెను. చూచినపుడంతా ఏదో తెలియని ఆనందం! పలుకరించినపుడంతా మోయలేనంత అనుభూతి!....ముగ్ధుణ్ణిచేస్తే బయట పడేవాణ్ణి. మనసు కాస్త తేలికపడితే, ఆ ఆనందం కరిగిపోయేవరకు, అనుభూతి యింకి పోయేవరకు తిరిగేవాడిని లహరిగా. మళ్ళీ వెళ్ళేవాడిని. మళ్ళీ అంతే! అదొక పిచ్చి. అదొక వ్యామోహము!

అయితే ఆనందము, అనుభూతితోపాటు కలిగిన అనుభవాలుకూడా అద్భుతమైనవే!

"ఏమండీ! ఏదో 'బోర్' కొట్టేస్తూంది. పొద్దుపోవడమే లేదు."

చీకాకుతో చిరునవ్వును మేళవించి, చిలిపిగా పలికేది జయలక్ష్మి. "అయితే నన్నేం చేయమంటారు?" అన్నట్లు చూసేవాడిని ఆమెవైపు ఆత్రంగా.

"ఏవైనా కొన్ని నవలలయినా తెచ్చిస్తే...."

నోటిమాట నోట్లో వుండగానే బయటపడేవాణ్ణి. ఆ పెద్ద గ్రంథాలయములో నా 'చిన్నఉద్యోగి' మిత్రుని కాళ్లావేళ్లా పడి బ్రతిమలాడేవాడిని. ఓ సందెడు పుస్తకాలతో ఆమె సమక్షంలో వాలేవాడిని రోజు తిరుగకముందే!

పందెములో గెల్చినంత సంబరముతో 'థ్యాంక్స్' అనేది ఆమె ఆ పుస్తకాలను అందుకొంటూ.

అదో! మళ్ళీ అవే చిరునవ్వులు!....చంద్రోదయంతో వికసించిన కలువపువ్వులు!....అబ్బ ఎంత సంతృప్తి!....మరెంత ఆనందం!!....

"చూడండీ! అందరూ స్నేహితులమంటారు. చల్లగా కబుర్లు చెబుతారు. మీ కోసం ఏమయినా చేస్తామని ప్రగల్భాలు పలుకుతారు. తీరా సమయం వస్తే అందరి బుద్ధుల్ని ఒకే త్రాసులో తూచవచ్చండి!" వాపోతూ అంటుంది ఆమె.

"ఇంతకూ యేం జరిగిందండీ?" కొంపమునిగినంత ఆతురతతో కారణంకోసం అడుగుతాను.

"లేకపోతే చూడండి. రెండు రోజులుం దనగానే చెప్పాను. 'దసరా బుల్లోడు' ఫస్ట్‌షోనే చూడాలనీ....ఓనాలుగు టిక్కట్లు తెచ్చి పెట్టమని! 'అదెంతపని!' అంటూ వెళ్ళాడండీ! ఇంతవరకు మనిషి పత్తా లేదు."

కాసేపు ఆగి మళ్ళీ తనలో తాను గొణుక్కునేది.

"పిక్చరేమో ఈ వేళ ప్రారంభమవుతూంది. ఛ ఛ! ఏం మనుషులో?...."

'వాడిమొగం వాడు లేకపోతే నేను లేనా?' అన్న భావన మనస్సు లోపలే గూటానికి కట్టబడ్డ గొడ్డులాగ తిరుగుతూంటే, పైకి లేచేవాడిని హుషారుగా! ఏదో పొడిచి గెలుద్దామన్న సంబరంగా!!

"అఁ! అన్నట్టు మరిచిపోయాను. మరో యిద్దరు మా 'ఫ్రెండ్స్' కూడ వస్తారట. మరచినట్టు నాలుగుటిక్కెట్లే అన్నాను. మొత్తం ఆరు టిక్కెట్లండీ. అన్నీ రిజర్వ్డే!....మరిచిపొయ్యేరు" అంటూ హెచ్చరించేది నేను బయలుదేరుతూ ఉంటే!

ఇక ఆపైన నావి కుక్కతిప్పలు!

ఇలా ఎన్ని వెట్టిచాకిరీలు? తలచుకొంటే మనసు సిగ్గుతో కుంచించుక పోతుంది. 'ఎందుకు నేనింత పతనమైపోయాను? ఏమైంది నా వ్యక్తిత్వం?' అని మనసు పరిపరివిధాల ఆలోచిస్తూ ఉంది. ఎంత ఆలోచించినా పిడుక్కూ బియ్యానికి ఒకటే మంత్రమన్నట్లు అంతటికీ ఒకటే సమాధానం—'నా విజయలక్ష్మి యిలా కోరివుంటే చేయలేనా?' అని. అయితే విజయలక్ష్మి ఎన్నడయినా యిలా ప్రవర్తించిందా? నన్ను వదలి ఒక్కటంటే ఒక్క సినిమా చూడగలిగిందా?....పోనీ. ఒకటికి ఆరు 'రిజర్వ్డు' టిక్కెట్లు తెచ్చియిస్తే, మాటవరుస కయినా 'మీరూ రండి!' అని పిలువకుండా వుండేదా?—అసలు నక్కకు నాగలోకానికి సామ్యం కుదర్చడానికి యత్నిస్తున్నట్లున్న ఆలోచనలు నాకే ఎబ్బెట్టుగా తోస్తున్నాయి. తెల్లనివన్నీ పాలని భ్రమించినందుకు తగిన శాస్తే జరిగింది.

అసలు జయలక్ష్మినుండి నేనేలాంటి ప్రతిఫలాన్ని అపేక్షించలేదు. ఆమె కన్నుల్లో విజయలక్ష్మి....ఆమె నవ్వుల్లో విజయలక్ష్మి కనిపిస్తూంటే కేవలం నా తృప్తికోసం గూడుచుట్టు గువ్వలా తిరిగినమాట వాస్తవమే! అయితే మాత్రం అంత సంకుచితత్వమా?....అంత కార్యసాధకత్వమా?....

"ఏం గురూ? పెద్దగా ఆలోచిస్తున్నట్లుంది"—పెద్ద గ్రంథాలయంలో చిన్న ఉద్యోగి మిత్రుడు అడుగుతున్నాడు. చెప్పుకుంటే తీరుతుందట బాధ. ప్రయత్నించాను.

సూదిలాంటి మనిషి. అంతయి, యింతయి, యింకెంతో అయి నంత నవ్వు నవ్వాడు. 'తగిలితే తెలిసిందా!' అన్నంత కసి ఉందా నవ్వులో. 'క్షణ క్షణముల్ జవరాండ్ర చిత్తముల్' అన్న భావన మిళితమైనట్లుంది ఆ నవ్వులో.

"చూడు బాబూ! శాస్త్రిలు పలికి పలికి బల్లి కుడితిలో పడ్డట్లున్నాయి నీ మాటలు. లేకపోతే పది పన్నెండు రూపాయలు గౌరిగింపు. ఓ రెండుగంటల జీవితకాలం వృధా!—దీనితో జరిగిన నష్టం వెరసి — ఆరు సినిమా టిక్కట్లు!—అంతేనా? దీనికే యింత బాధ పడిపోతున్నావే? మరి ఆడదాని చిరునవ్వులంటే సామాన్యమా? సామ్రాజ్యాలు అస్తమించింది వాటితోనే! కోటలు మొదలు కొంపలవరకు నిలువునా కూలింది వాటితోనే!

ఎందరో అందాల బరిణెలు, పాపం! ఎవరో అజ్ఞాతవ్యక్తులను చిరునవ్వులతోనే ఖైదుచేసి, వాళ్ళను బూదిచేసి, వన్నెల విసనకర్రల్లా విహరిస్తున్నారంటే ఆ చిరునవ్వుల ప్రభావమే!—ఇంతెందుకు గురూ!— గాంధీరోడ్డులో 'పేవ్‌మెంట్'మీద ఓ పాతగోనెపట్ట మరుగులో ఓ రెండు జాకెట్లు నాలుగు డ్రాయర్లు కుట్టుకొని బ్రదికే దర్జీ వాడు—కాళ్ళాడితేగాని కడుపు పూడని దర్జాగాడు.... రోజంతా కష్టపడ్డ సంపాదనకు మరో రెండు రూపాయలు చేబదులు కలిపి, 'టెరీకాట్' గుడ్డ కొంటాడు. ఓర్పు నేర్పు నంతా వినియోగించి 'జాకెట్టు' కుడతాడు. ఆపై ఎప్పుడో ఆరున్నొక్క—అడుగుల దూరంలో లీలామాత్రంగా భాసించిన చిరునవ్వులను వెదుక్కొంటూ వెళతాడు ఎండమావులను వెదుక్కొని వెళ్ళినట్టు.

"ఎందుకండీ? నేనేదో మాటవరసకన్నాను. మీకెందుకీ అనవసరమయిన ఖర్చు. ప్రయాస!" చిరునవ్వులు చిరుకోపాన్ని సంతరించుకొని కడప కవతల నిలబెడుతుంది దర్జీవాడిని. పాపం! అప్పుడు చూడాలి వాడి మథన. పదిరూపాయల తేడాతో 'టెండరు' కోల్పోయిన కాంట్రాక్టరు వాడికంటే ఎంతో నయం.

"అబ్బే! దీనికోసం నయాపైసా వెచ్చించలేదంటే నమ్మండి. ఎవరో నాలుగు గౌన్లకోసం కాస్త యెక్కువగానే కొన్నారు. నేను చేసిందంతా ఆ కాస్త యెక్కువను, మరికాస్త యెక్కువ జాగ్రత్తతో కత్తిరించడమే!"

చాల చాకచక్యంగా కత్తిరిస్తే, అది పచ్చి అబద్ధమయినా కానట్లే కనుపిస్తుంది. అయితే 'థేంక్స్' అంటుంది ఆమె. ఆ జాకెట్టును అందుకొంటూ ఒక్క అడుగు ముందుకువేస్తుంది. రెండడుగులు వెనక్కు వేస్తాడు దర్జీవాడు. అప్పుడు వాళ్ళిద్దరు ఎక్కడవుంటారో తెలుసా?— ఇంటిబయట ఒక్క అడుగుదూరములో ఆమె. మూడడుగుల దూరంలో వాడు!—'అయ్యో! అలా నిలబడిపోయావే?' అని వాపోతుంది క్రీగంట అతనిని చూస్తూ. ఇప్పుడు చూడాలి దర్జీవాడి దర్జా!—ముసిముసినవ్వులతో మూడువంకలు తిరిగి, చేతులు నలుపుకొంటూ తిరుగుముఖంపడతాడు, 'గుర్ గుర్'మని అరిచే పెళ్ళాం, పిల్లల ప్రేవులమీద తడిపి తడిగుడ్డవేయడానికి!" అని. అపి, 'ఎలా వుందంటారు లోకం?' అని అడుగుతాడు. ప్రయత్నపూర్వకంగాకాకుండా ఏదో పరాశక్తి ఆవరిస్తే పలికిన పలుకుల్లా ఉంటాయి అతని మాటలు. వింతగా అతనిని చూస్తూ వినడమే నా వంతు!—

ఆ పై చిరునవ్వుల మాయలో పడకూడదనుకొన్నాను. ఇష్టమొచ్చినట్లు పరుగిడుతున్న మనస్సుకు ముక్కుదారం కుట్టాను. స్వార్థపరుల చుట్టు తిరుగడమంత నామూషీ మరొక్కటి లేదన్న పాఠం నేర్చుకున్నాను. తత్ఫలితం ఆ యింట్లో అడుగుబెట్టడం మానుకొన్నాను ప్రయత్నపూర్వకంగా!

*    *    *

చెప్పినపని కాసంత పొల్లుపోకుండా తన పనేమో తానేమోగా ముందుకుపోయే సేవకుడితో కాలపురుషుడు పోటీపడితే, ఎవరు జయిస్తారో, ఎంతకాలం ఈ పోటీ నెగ్గిస్తామో, చూద్దామని, ఓ యజమాని జాగ్రత్తపడి 'క్యాలెండర్లో' ప్రతిదినమూ ఓ కాగితాన్ని చింపుతూవస్తే ఆరునెలలు దాటినట్లే

తెలియలేదు. వేసినచోటవున్న గొంగళిలానే వున్నాడు సేవకుడు. 'కానీ చూద్దాం నీ కథ!' అని కాలపురుషుడు వాడిపై కాలుదువ్వుతూనే వున్నాడు. యజమాని 'క్యాలెండరును' దాంతోపాటు యింట్లో మరో ఇనప్పెట్టెను చేర్చాడు!

ఆ రోజు జనవరి మొదటితేది!

ఆ మొదటితేదికి మనకు అమావాస్యకు పీర్లపండుగకు వున్నంత సంబంధం. అయినా దినము కనబడుతూ, కనబడినపుడంతా పలుకరిస్తూ, అవసరాన్ని ఆదుకోగలిగిన పరాయివాడు దగ్గరిచుట్టాన్నికూడ చాపచుట్టలా చుట్టివేయగలడు. అందుకే మనదికాని ఆ మొదటిరోజు మీద మనకంత వ్యామోహం.—ఆత్మీయులకు అభినందనలు....దైవదర్శనాలు....ఏదో తెలియని కలకలము....కలవరము!—

ఆ ముందటి నాలుగేళ్ళు నేనూ వూరేగాను విజయలక్ష్మితో కలిసి. మొదటి తేది మూడు రోజులుందనగానే బజారుమీద పడేవాళ్ళం. బజారు అంతా కొన్నంత సంబరం. తీరా కొనేది జత బట్టలు. ఆ మొదటి తేదీన యిద్దరు తొడుగుకొనేవాళ్ళం. ఆపై తిరుమలకు వెళ్ళడం...దైవదర్శనం.... అదొక జాతర! — మధ్యాహ్నం 'విందు' పేరుతో ముక్కువరకు మెక్కడం....తినింది అరిగేవరకు యిష్టమొచ్చినట్లు సాయంకాలం వరకు తిరగడం....తరువాత సినిమా. ఆనాటి కార్యక్రమంలో కడపటి అంశం— ఓహ్! ఆ రోజులన్నీ ఎంత సందడిగా జరిగాయో, ఈ రోజు అంత మందకొడిగా వుంది. విజయలక్ష్మి లేనిలోటు కొట్టవచ్చినట్టు కనిపిస్తూ ఉంది. గతకాలపు తలంపులన్నీ మనస్సును కలచివేస్తున్నాయి. తిరిగాను. తిరగని చోటు లేదనకుండా తిరిగాను. కాళ్లు అలసిపోయేవరకు తిరిగాను. తీర్గా కూర్చొని, ఓ ఏకాంతప్రదేశములో కూర్చొని యేడ్చాను కంటతడి ఆరిపోయేవరకు. ఇంకా యేదో బాధ. ఎందుకో జయలక్ష్మినైనా చూద్దామనిపించింది. అందుకే ఆరునెలల తరువాత ఆ యింట్లో అడుగుపెట్టాను.

జయలక్ష్మి చాల చిత్రమైన మనిషి! ఆమె అర్థంకాని ఓ సమస్య. నేర్పుగా వల విసురుతుంది. తగులుకొన్న పక్షిలాంటి మానవుణ్ణి చూచి 'పకపక' నవ్వుతుంది తన ప్రతిభకు తానే మురిసిపోతూ!—

సాధారణంగా నావలన కావలసినపని అంటూ లేకపోతే జయలక్ష్మి తీరే వేరుగా ఉంటుంది. ఏదో పనిలో మునిగివున్నట్లు నటించడం....అధవా తప్పనిసరిగా యెదుటపడవలసివస్తే ఓ చిరునవ్వు తరగను విసరడం.... 'ఏఁవమ్మా! పాపం!ఆయనను బెల్లంకొట్టిన రాయిలా కూర్చోబెట్టావే?' - అని ఎవరైన ప్రశ్నిస్తే, 'ఏదో పత్రిక చూస్తున్నట్లుందే! చూడనీ!—పాపం. 'డిస్టర్బు' చేయడమెందుకు?'—అని చాకచక్యంగా సమర్థించడం....లేదా ఏదో పని కల్పించుకొని ప్రక్కయింటికి మకాం మార్చడం....ఇవి వేరైన తీరులోని ఆమె లీలలు!....అలాంటి జయలక్ష్మి ఈనాడు నా అలసటను గుర్తించింది. వద్దని వారిస్తున్నా వినిపించుకోకుండా 'కాఫీ' చేయడానికి వెళ్ళింది. అదే ఆలోచిస్తున్నాను, ఇది ఆరు నెలలుగా కనబడని ఫలితమా? లేక షరా మామూలైన కార్యసాధకత్వమా? అని.

అంతలో ఆమె వచ్చింది. వస్తూ కాఫీ తెచ్చింది. 'ఏమిటండీ? ఆ పర ధ్యానం!' అంటూ కమ్మగా పలికింది. కాఫీలో కమ్మదనము ముక్కుపుటాలను, మాటల్లో కమ్మదనము కర్ణేంద్రియాలను మృదుమధురంగా పరామర్శిస్తున్నా, అంతవరకు నన్ను పరామర్శిస్తున్న ఆలోచనలకు మాత్రం అంతరాయం కలుగలేదు.

కాఫీ అందుకొన్నాను. చాలవేడిగా ఉంది. ఆమె చిరునవ్వులు చాలా వాడిగా వున్నాయి. కాస్త చల్లారనీ అని కాఫీ మేజామీద పెట్టాను. ఓ కుర్చీ లాక్కొని ఆమె కూర్చుంది నా ఎదురుగా!

"ఇప్పుడు చెప్పండి. మా శాంత అన్నట్లు 'స్ట్రయిక్' చేశారేం?"

'దేనిని'—ఆంగ్లభాషలో 'స్ట్రయిక్' అన్న పదానికి కొట్టడం అనే అర్థంకూడ వుందని స్ఫురించి అడిగాను.

"మీ పద్ధతిని."

"ప్రత్యేకించి నాకు పద్ధతి అంటూ యేమీ లేదు. ఆ పద్ధతిని నేను కొట్టనూలేదు. కొయ్యనూలేదు."

మాటకు మాట తెగులు. నీటికి పాచి తెగులు.

"అవసరమైన వాదన అనర్థాలకు దారి తీస్తుందికానీ వస్తూ వస్తూ వుండి వున్నట్లుండి రాకుండా మానివేశారేం!"

"ఏముంది? వీలున్నప్పుడంతా వచ్చాను. వీలు లేకపోయేసరికి రాలేదు. దీనిని ఓ పద్ధతి క్రింద జమకట్టవలసిన అవసరమేమీ లేదే!"

"మీరు చెప్పిందే కారణమైతే ఫరవాలేదుకానీ, కారణం మాత్రం అది కాదనిపిస్తూ ఉంది నాకెందుకో! పోనీలేకానీ, రాత్రి ఓ నాటకం ప్రసారమయింది రేడియోలో విన్నారా?" మాట మార్చింది జయలక్ష్మి.

"లేదండీ!"

"అరెరె! మాంచి నాటకం? చక్కని అవకాశం జారిపోయిందండీ! ప్చ్....మీరూ వినివుంటే!...." తేలిపోతూ ఉంది జయలక్ష్మి.

"మీలో మీరే అనుభవిస్తే యెలా? ఆ యితివృత్తమేదో...."

"నిజంగా ప్రతి మనిషిని చక్కగా ఆలోచింపచేసే కథావస్తువు.... ప్రతి వ్యక్తినీ బాధావిముక్తుణ్ణి చేయగల సన్మార్గోపదేశము....పైగా పాత్ర చిత్రణ....సమర్పణ ఎంతో చక్కగా కుదిరాయి."

తినబోయే పదార్థాల రుచినిగూర్చి ఎక్కువగా వింటే తీరా తినబోయే టప్పటికి మొగం మొత్తినట్లవుతుందని తెలియకకాదు కానీ, ఈ ఉపోద్ఘాతంతో మళ్ళీ నాకోసం ఏదైనా పల్లం త్రవ్వుతుందేమో అన్న సందేహంతో చూపులు అదోరకంగా మారుతున్న మాట వాస్తవం.

గ్రహించినట్లుంది ఆమె!

"అతడొక నిరుపేద కార్మికుడు. కుటుంబ నియంత్రణోద్యమాన్ని కాలదన్ని కుచేల సంతానోత్పత్తి గావించిన ధార్మికుడు. చాలీచాలని సంపా

దన....ఆ యిల్లాలి అగచాట్లు....ఆ పిల్లల ఆకలి మంటలు....ఆశా నిరాశా వాదాలమధ్య ఆలుమగల కొట్లాటలు....ఆ సంసారం సాగని బండి!....తగిలిన కాలికే తగులుంది. అతని తల తగులుకొనింది ఓ యంత్రంలో ఒకనాడు.... ఇక చూడండి! చేతికందని బిడ్డలతో ఆ యిల్లాలి అగచాట్లు...."

"ఇలాంటివి చాల వింటున్నాము. అంతకన్నా ఎక్కువగా చూస్తు న్నాము. ఇందులో...."

"చెబుతున్నా వినండి. అతడు పోయాడు. పుట్టిన ప్రతి వ్యక్తీ పోతూనే వున్నాడు. ఇది సహజం. కానీ అతనిలాగ దూరదృష్టి కలవాళ్ళు మాత్రం సంఘంలో చాలా అరుదుగా కనుపిస్తారు."

"ఏమంటారు?" అన్నట్లు చూసింది నావైపు. అసలు విషయం తెలియకుండానే నేనేమీ చెప్పలేని స్థితిలో మూగనోము పట్టాను.

"మొదట అందరు అతనిని నిరుత్సాహపరచిన వాళ్ళే. గొర్రెతోక బెత్తెడని జ్ఞాపకం చేసినవాళ్ళే. దీనిని లక్ష్యపెట్టకుండా అతడు చేసింది మాత్రం చాల మంచిపని!"

"ఏమిటండీ ఆ మంచిపని?" నాకు తెలియకనే విసుగు ధ్వనించింది నా ప్రశ్నలో.

"తన తాహత్తుకు మించినపని అని తెలిసికూడ అతడొక పాతికవేలకు యిన్సూర్ చేశాడు!"

ఇందులో క్రొత్తదన మేమిటో నాకేమీ అర్థంకాలేదు. తెలుసుకోవా లన్న కోరికపైపుకూడ నా మనసు సుముఖంగా లేదు. ఆ కార్మికుడు తాను చనిపోతానని ముందుగానే కలగని 'యిన్సూర్' చేశాడా? లేక జలగల్లాగ తగులుకొనే యేజంట్ల వాత పడ్డాడా?" అని ఆలోచిస్తున్నాను.

"భర్త చనిపోయిన వార్త ఆమె చెవిని పడడము....ఆ పిల్లల కాకి శోకము....అబ్బ! తలచుకొంటే ఒళ్ళు జలదరిస్తుంది! కానీ ఆ 'యిన్సూర్' మాట చెవినిపడడము....ఆ డబ్బు చేతికందడం....ఎంత తేలికై పోతుందను

కున్నారు మనసు!" పరవశించి పోతుందన్నట్లు తోచింది. ఆమె పొందిన అనుభూతిని అర్థం చేసుకోలేక తికమకలు పడడంతో నోట మాట రాలేదు.

"అప్పుడనిపించింది నాకు, ప్రతి ఒక్కరు యిన్సూర్ చేసి తీరాలని! మీరేమంటారు?" అడుగుతూ ఉంది ఆమె.

"నేనంటాను మీతో యేకీభవించలేనని!"

"కారణం?"

"అన్నిటికీ కారణాలు దొరకవు."

"అంటే!"

"అంటే, ఆత్మవిశ్వాసం లేనివాళ్ళే ఈలాంటి వాటిమీద పడుతూ ఉంటారు. లాటరీలు, రేసులుకూడ ఈ కోవలోనివే....ఎందుకో వీటన్నిటి పైన నాకేమో తగనిమంట!"

"అయితే యింతవరకు మీరు యిన్సూర్ చేయలేదన్న మాట!"

"అన్న మాటేమిటి?....లేదు."

"చాలా విచిత్రంగా వుంది."

"ఉంది."

"ఉన్నదేమిటి? దీనికేమైనా ప్రత్యేకమైన కారణముందా?"

"ఉంది. నామీద నాకు నమ్మకముంది. కాబట్టి యిలాంటివాటిమీద అపనమ్మకముంది."

"అయితే యికమీదటకూడ యింతేనా?"

"అయితే!—అయినా యిదేమిటండీ? మీరే ఏజంటు అయినట్టు, లేదా వకాలత్ పుచ్చుకొన్నట్టు వాదిస్తున్నారు."

"అబ్బే! అదేమీలేదండీ! మాటవరుసకి అడుగుతున్నాను. అయినా మీకోసం మీ భవిష్యత్తు కోసం 'ఇన్సూర్' చేయడం మంచిదండీ! ఇందులో తప్పుకూడ ఏమీ కనుపించలేదు. ఇప్పుడు మాత్రం మించిపోయిందిలేదు. ప్రయత్నించి చూడండి!"

"అది జరగదులెండి."

"అదేమిటండీ? అలా అంటారు. మీరేమీ యిలానే వుండబోరుగా? పెళ్ళి చేసుకొంటారు. తరువాత పిల్లలు.... కనీసం వాళ్ళకోసమైన మీరు కాస్త వెనుకేయాలి. పోనీలే ఈ సోదెందుకు? ఒకవేళ నేనే ఏజంటునైతే.... మిమ్మల్నే 'ఇన్సూర్' చేయమని అడిగితే....!

అదో మళ్ళీ అవే చిరునవ్వులు.... నన్ను పిచ్చివాణ్ణి చేసి ఈ లోకాన్ని మరపించగల మత్తుమందు లాంటి రవ్వలు....

సమాధానంకోసం మనస్సుతోపాటు నోరు తడబడుతూ ఉంది. అదే చిరునవ్వుతో ఆమె అవనత శిరస్కురాలై, నన్ను క్రీగంట విలోకిస్తూ.... టేబిలు సొరుగు తీస్తూ మూస్తూ ఉంది. పిచ్చుకలు అరుస్తున్నాయి. పంచన నామాల ఆసామి కళ్ళద్దాలతో అన్వేషిస్తున్నాడు దేనికోసమో? నట్టింటిగూటి పైన నలుగురు దేవుళ్ళు నన్నుజూచి నవ్వుతున్నారు జాలిగా.

"చెప్పండి!"

జయలక్ష్మి కాదు—నా విజయలక్ష్మి నన్ను నిలదీసి అడిగినట్లుంది. 'ఈ మాత్రం నాకోసం చేయలేవా?' అని బ్రతిమాలాడుతున్నట్లుంది.

వ్యక్తం చేయలేని అనుభూతి నన్ను వివశుణ్ణిచేస్తూ ఉంటే—మాట వరుసకి అడిగినప్పుడు యింతసందేహ మెందుకని? మనస్సు ఓ వైపు మంద లిస్తూ ఉంది. నాకు తెలియకనే వూగింది నాతల అడ్డంగా మాత్రంకాదు ఔనని!

ఆనంద పరవశురాలైన నా విజయలక్ష్మి కంటి నిండుకు కనుపిస్తూ ఉంటే, అలానే చూస్తూ వుండిపోయాను. ఆ అనుభూతి కొన్నిక్షణాలు మాత్రమే!

"మీరు మంచి వారు. మాట తప్పనివారు. మాట విలువ తెలిసిన వారు...."

ఆమె చెబుతూ వుంది. ఆ మాటలు నాకు అర్థంకానిమాట వాస్తవం. అందుకే అర్థరహితంగా ఆమెను చూడడం నావంతు అయింది.

అంతలోనే బయటకు లాగిన టేబిలు సొరుగు ఆగిపోయింది. అందులోనుండి ఆమె బయటికి తీసింది ఓ కాగితాన్ని! నా చేతి కందించింది. ఆ కాగితం స్వరూపం కంటబడేసరికి కంటిలో నలుసు పడినట్లయింది. కడుపులో రాయి పడినట్లయింది! బైర్లు కమ్మిన కండ్లు ఆ కాగితాన్ని చదువలేక పోతున్నాయి!—ప్రయత్న పూర్వకంగా పరిశీలించాను. జీవిత భీమా సంస్థవారు ఆమెను 'ఏజంటు'గా నియమించిన అధికార పూర్వక పత్రమది!

"మంచి మనసు కలిగిన మీ లాంటివాళ్ళు మొదటి బోణీచేస్తే—బిజినెస్ బ్రహ్మాండంగా జరుగుతుందట! నీమంటారు?"

చిలిపిగా అడుగుతూ ఉంది ఆమె!

ఒళ్ళు చల్లబడింది.

అంతకంటే చల్లబడిపోయిన టేబిలుమీద కాఫీ నీళ్ళు ఎండిన గొంతులో ఎటూ పోలేక కనుకొలకుల్లో నిండగా, అంతకంటే నిండుగా నవ్వుతూ ఉంది ఆ భామ జీవిత భీమా విజయంతో! *